
## సాయంకాలం. గోదావరి వొడ్డు... హాయిగా గాలి. చల్లని గోదావరి గాలి. సినిమాతెరమీద బొమ్మలా—వంతెనమీద పోతున్న రైలు!

# మార్పు

**ఎస్.ఆర్.రావు**



వంతెనకింద నీలంగా మెరుస్తున్న నీళ్ళు.

నీరెండకి మెరుస్తున్న యిసుక—

గాలికూగుతున్న తెరచాపలు—

నీటికొంగల్లా తేలిపోతున్న పడవలు!

ఈ రేయి నన్నొల్లనేరవా రాజా...

ఎందుకో ఎంకిపాట గుర్తొచ్చింది శోభకి, మనసంతా బాధగా అనిపించింది!

చెక్కిలిమీద చెయ్యిచేర్చి ఆలోచిస్తూ కూర్చుంది!

పక్కన కూర్చున్న కృష్ణమూర్తి కివేమీ పట్టలేదు. జేబురుమాలులో పోసుకున్న వేరుశనగకాయలు కొట్టుకొని తింటున్నాడు. కాఫీకి కుంచెడిచ్చేవారుట ఆరోజుల్లో— పది పైసలకి పట్టెడు రావటంలేదిప్పుడు—అతని ఆలోచన ఆ ధోరణి!

"తిను" కాసిని వేరుశనగకాయలు శోభ ముందుకు నెట్టాడు.

వద్దని తలతిప్పింది.

ఎంకిపాట యింకా సుళ్ళు తిరుగుతోంది ఆమె మనసులో!

చప్పుడు చేసుకుంటూ ఎగిరిపోతున్నాయి నీటి పిట్టలు.

చప్పుడు.

నిద్రపోతున్న చెరువులో రాయిపడ్డట్టు కలకలం! వొడ్డున కూర్చున్నవారంతా ఒకసారి లేచారు. కుతూహలంగా చూస్తున్నారు. ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు.

వెకిలిగా మాటలు.

మకిలిగా చూపులు.

అసహ్యంగా ఈలలు!

"లాడ్జింగ్ సరుకురోయ్-"

"అప్సరసల అప్పచెల్లెళ్ళు. ఈనాటికి వీధినపడి— పోలీసుకౌగిళ్ళ నలిగి— కోర్టెక్కి- ముడుపు చెల్లించియో చెల్లింపకో- కటకటాల వెనక... కాకుంటే- అప్పుడు అంతఃపురం తిరిగి చేరు-" ఎవరో ముసలాయన ముక్కుపొడుండబ్బా ఆయన కవి

త్వమే చెప్పాడు. పక్కనున్న నూనూగు మీసాల కుర్రాడు ఫక్కున నవ్వు. లోకం తెలియని వయస్సు. తెలిసీతెలియని నవ్వు.

"చేరి ?—" అన్నాడు.

"చేరి- కుర్రా ! కథ మొదలు మళ్ళీ— తిరిగి లాడ్జింగ్ కొచ్చు. రైడింగ్ లో దొరుకు, పోలీసు కౌగిళ్ళ నలుగు, కోర్టెక్కు—"

ఫెళ్ళున నవ్వు.

శోభ కళ్ళు పెద్దవి చేసుకొని వింతగా చూస్తోంది.

అటూ ఇటూ పోలీసులు-మధ్య నలుగురు అమ్మాయిలు ! వాడిపోయిన మొహాలు, వడిలిపోయిన వొళ్ళు, పీడిపోయిన జుట్టు, నలిగిపోయిన బట్టలు— నీరసంగా ఉన్నారు. కళ్ళు ఏడుస్తున్నా పెదాలు నవ్వుతున్నాయి. తెచ్చిపెట్టుకున్న వయ్యారం- వికారంగా ! అలవాటైపోయినట్లుంది- చూస్తున్న జనాన్ని పట్టించుకోకుండా- మొగుడితరపు చుట్టాలింటికి యిష్టంలేకుండా వెళుతున్నట్లు వెళుతున్నారు !

"ఎవరు వాళ్ళు ?" అంది శోభ.

కళ్ళు పెద్దవి చేసుకుని నాలిక తడుపుకుంటూ చూస్తున్న కృష్ణమూర్తి ఉలిక్కిపడ్డాడు !

"తెలియటంలా— కంపెనీ సరుకు ! ఏ లాడ్జింగులోనో దొరికుంటారు. పట్టుకుపోతున్నారు !"

శోభకు మనస్సు చివుక్కుమంది.

పట్టుకుపోబడుతున్న అమ్మాయిల గుంటలుపడ్డ కళ్ళల్లోని నీటిపొర సాయంకాలం ఎండలో తళుక్కుమంది.

సందడి తగ్గింది.

జనం చాలామంది వాళ్ళవెనకే వెళ్ళారు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ ?" అన్నాడు కృష్ణమూర్తి.

"వ్యభిచారం నేరం కదండీ !"

"బాగుంది ప్రశ్న"

"బెర్నార్డ్ షా కాబోలు అన్నాడు వివాహం చట్టబద్ధ వ్యభిచారం అని—"

కృష్ణమూర్తి ఉలిక్కిపడ్డాడు.

"చట్టబద్ధ వ్యభిచారానికి లైసెన్సు బిళ్ళ" మంగళసూత్రం తీసి పట్టుకుంటూ అంది.

కృష్ణమూర్తికి కంపరంగా వుంది. సతీ సుమతి సినిమాలు మళ్ళీ మళ్ళీ వస్తోనేవున్నా కుమార శతకాలు, వ్రతాల, నోముల కథలు బళ్ళకొద్దీ యింకా అచ్చవుతూనే వున్నా, పాతివ్రత్య మహిమల ఉపన్యాసాలు గంటలకొద్దీ మహిళామణులే ఇంకా గొంతెత్తి ఇస్తోనేవున్నా— యిన్ని చేస్తున్నా— ఇంకా అక్కడక్కడ ఆడవాళ్ళు ఆలోచిస్తున్నారే అని అతని బాధ.

"వ్యభిచారం అంటే ఏమిటండీ ?"

కృష్ణమూర్తికి వళ్ళుమండింది.

"వ్యభిచారం అంటేనా—డబ్బుతీసుకొని సుఖాన్నివ్వటం— అర్థమయ్యిందా ?" అన్నాడు పళ్ళు కొరుకుతూ.

"కట్నం డబ్బు కాదాండి ?"

కృష్ణమూర్తి హడిలిపోయాడు.

"కట్నంపుచ్చుకొని మీరు నాకిస్తున్న సుఖం—?"

కృష్ణమూర్తి లేచి నుంచున్నాడు.

"ఇంటికి పోదాం— పద" అన్నాడు.

"ఇంటికేగా— పదండి !"

వెలుగులోంచి- చీకట్లోకి.

నేలమీద నుంచి—ఊబిలోకి.

గాలిలోనుంచి గాలిరాని ఆ ఇరుకు గదుల కొంపలోకి—

వెలుగుతున్నా వెలుతురివ్వని దీపాలు వెలిగించి- అగ్గిపుల్లతో స్టవ్ అంటించి-అత్తెసరు పడేసి- ''ఆవకాయతో సర్దుకోండీపూటకి-'' అంది.

కృష్ణమూర్తి ముభావంగా వున్నాడు.

అన్నం తిని మంచం వాల్చి— ''రండి'' అంది.

సిగరెట్టు వెలిగించి- ఆలోచిస్తున్నట్లు— గంభీరంగా పెద్దపోజుగా కృష్ణమూర్తి :

''రండి మరి ! టైముటైమే డబ్బుడబ్బే- జరిగిపోతే వెనక్కిరాంది కాలం. జారిపోతే తిరిగిరాంది డబ్బు ! డబ్బొదిలింది మా నాన్నకి, నాకు సుఖమున్నాదక్కనివ్వండి!''

తేలుకుట్టినట్లు గిలగిల్లాడాడు కృష్ణమూర్తి.

సిగ్గులేదా, నువ్వాడదానివికావా లాంటి మాటలని ఉపయోగంలేదు. ఆ రెండు మాటల్ని ఏనాడో కొట్టేసింది శోభ. నవ్వి నవ్వి విరగబడి- 'ఆడవాళ్ళే కాదు అవసరం అయినప్పుడందరూ సిగ్గుపడాలి'' అంది.

కృష్ణమూర్తికి మాటలుకరువు. ఆడదాన్ని నమ్మరాదనే తత్వాలు, స్త్రీ బుద్ధి ప్రళయాంతకః అన్న సూక్తులూ విన్నాడు కాని- అవన్నీ సమర్థించి శోభని ఒప్పించగల్గిన పాండిత్యం లేదు.

ఇల్లు ఇరకటం ఆలి మర్కటం అన్నారు. ఇరుకైన ఇల్లు దొరికింది కాని రంభలాంటి భార్య దొరికిందే అని అతని బాధ !

గడియారం గంటలు కొడుతోంది-

''ఏమండోయ్ ! రేయి గడిచిపోతోంది. మీకేం- నష్టం నాది. డబ్బిచ్చి కొనుక్కున్నదాన్ని నేను ! జీవితకాలమంతా సుఖాన్నివ్వటానికి టోకున ఒక్కసారి ఇరవై వేల రూపాయలకు కొన్నాం మిమ్మల్ని ! ఇలా నాన్పుడుగాళ్ళని, జిడ్డుమొహమనీ తెలిస్తే—''

''శోభా'' పిచ్చిపట్టినట్లు అరుపు.

బర్రుమని డ్రాయరులాగి—

చర్రుమని చెక్కుబుక్కు తీసి—

పర్రుమని రాసి—

చెక్కు విసిరేశాడు !

''చాలించు నీ మాటలు ! ఇదుగో ఇరవై వేలకు చెక్కు. రేపే మీనాన్నకు పంపెయ్యి.''

శోభ లేచికూర్చుంది.

బుగ్గన చేతులు పెట్టుకొని కళ్ళు పెద్దవి చేసి చూసింది.

మెరుస్తున్న కళ్ళల్లో కృష్ణమూర్తి మెరిశాడు !

చప్పున కళ్ళు వాల్చింది.

మెరుపు మాయమయింది.

చిన్నగా నిట్టూర్చి—

''సర్లెండి... ఒక చింతామణో, మరొక మధురవాణో మారినంత మాత్రాన పడుపు వృత్తి సమసిపోయిందా ? మీ రొక్కరు పుచ్చుకొన్న కట్నం తిరిగి యిచ్చినంత మాత్రాన లోకంలో కుర్రాళ్ళంతా యిక కట్నాలే పుచ్చుకోరా ! ఎందుకొచ్చిన గొడవ కాని- పడుకుందాం- రండి !'' అంది.

అంటూనే లైటార్పి అటుతిరిగిపడుకుంది!

పెద్దలకే కాదు

ప్రజాతంత్ర

పిల్లలకు కూడా